క్లుప్తంగా

ఎంపీ వితరణ



ఎంపీ అందజేసిన డ్రమ్స్‌తో కమిటీ సభ్యులు

సదుం: వినాయక చవితి పురస్కరించుకుని మండలంలోని జోగివారిపల్లె, మారుతివారిపల్లెలోని వినాయక చవితి ఉత్సవ కమిటీలకు రూ. 50 వేల విలువ చేసే బళ్లారి డ్రమ్స్‌ను రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి వితరణ చేశారు. వీటిని సర్పంచ్ అనితాకుమారి వారికి అందజేశారు. ఎంపీకి జోగివారిపల్లె గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

పండ్ల మొక్కలు పంపిణీ



రొంటకుంట్ల రోడ్డు వద్ద పండ్ల మొక్కలను పంపిణీ చేస్తున్న దృశ్యం

పలమనేరు: పట్టణానికి చెందిన పలమనేరు ప్రకృతి, బెంగళూరుకు చెందిన జేటీడీ స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని పలు గ్రామాల్లో పేద మహిళలకు వివిధ రకాల పండ్ల మొక్కలను ఉచితంగా పంపిణీ చేశారు. ఇళ్ల వద్ద పండ్ల మొక్కల పెంపకం పేద మహిళలకు ఆదాయ వనరుగా ఉంటాయనే ఉద్దేశంతో అందజేసినట్లు మల్లిచెట్ల దేవేంద్ర తెలిపారు.

ప్రశాంతంగా నిమజ్జనాలు : సీఐ

పుంగనూరు: వినాయక నిమజ్జనాలు ప్రశాంతంగా, శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా నిర్వహించాలని సీఐ శ్రీనివాసులు అన్నారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఉత్సవ కమిటీల ప్రతినిధులకు సమావేశం నిర్వహించి సీఐ మాట్లాడారు. స్టేషన్ పరిధిలో 187 ప్రాంతాలలో విగ్రహాలను ఏర్పాటు చేశారని, ఏఏ ప్రాంతంలో నిమజ్జనాలు నిర్వహించేది ముందుగానే తెలియజేయాలన్నారు. నిమజ్జనంలో ఎలాంటి అపశ్రుతులు చోటుచేసుకున్నా కమిటీలదే బాధ్యత అని హెచ్చరించారు. ముఖ్యంగా నిమజ్జనాలకు చిన్నపిల్లలను తీసుకెళ్లరాదని, విద్యుత్ విషయంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ఇస్లాంనగర్‌లో తిష్ట వేసిన సమస్యలు

పుంగనూరు: మున్సిపాలిటీ పరిధి నక్కబండలోని ఇస్లాంనగర్‌లో సమస్యలు తిష్ట వేశాయి. ప్రధానంగా మంచినీటి సమస్య ప్రజలను తీవ్రంగా వేధిస్తోంది. పారిశుధ్యం పడకేయడంతో దోమలు విజృంభిస్తున్నాయి. ఫలితంగా జ్వరాల బారిన పడుతున్నట్టు స్థానికులు వాపోతున్నారు. ఇస్లాంనగర్‌లో రోజులు గడుస్తున్నా చెత్త తొలగించకపోవడం, కాలువల్లో మురుగునీటి నిల్వలతో పాటు ఖాళీ స్థలాల్లో ముళ్లపొదలు పెరగడంతో దోమల మోత పెరిగింది. మరోవైపు మంచినీటి సరఫరా విషయంలో మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో పది రోజుల క్రితం నక్కబండ వాసులు ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. అయినా మంచినీటి సరఫరాలో మార్పేమీ లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా అధికారులు ఇక్కడి సమస్యలపై దృష్టి సారించి పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

మహాభారత యజ్ఞం ప్రారంభం

తవణంపల్లె: స్థానిక ద్రౌపదీ సమేత ధర్మరాజుల గుడిలో ఆదివారం మహాభారత యజ్ఞంకు శ్రీకారం చుట్టారు. ఆలయంలో ద్రౌపదీ సమేత ధర్మరాజు, భీముడు, అర్జునుడు, నకుల సహదేవుల విగ్రహాలకు అర్చకులు శాస్త్రోక్తంగా అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు చేశారు. అనంతరం ముక్కోటి దేవతలను ఆహ్వానిస్తూ ధ్వజారోహణం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ నెల 30వ తేదీ వరకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ప్రతి రోజూ భాగవతారిణి స్వర్ణలత హరికథాగానానం చేస్తారని ఆలయ ధర్మకర్త మునస్వామి శెట్టి, కార్యనిర్వాహకులు తెలిపారు.

ఎస్పీ చవితి పూజలు



పూజలు చేస్తున్న చిత్తూరు ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్: చిత్తూరు ఎస్పీ మణికంఠ చందోలు శనివారం తన క్యాంపు కార్యాలయంలో వినాయకున్ని ప్రతిష్టించి ప్రత్యేక పూజలు చేశారు. గణపతికి నైవేద్యాన్ని సమర్పించి.. విశ్వాసం, భక్తికి పండుగలు అవసరమన్నారు. ఎస్పీతో పాటు క్యాంపు కార్యాలయ అధికారులు, సిబ్బంది పూజల్లో పాల్గొన్నారు.

పలమనేరులో ఏర్పాటు చేసిన బొజ్జగణపయ్య విగ్రహాలు





పుంగనూరు: నగిరివీధిలో..



కట్టకిందపాళెంలో..



జై..జై గణేషా..!

- వాడవాడలా వెలసిన బొజ్జ గణపయ్యలు
- విద్యుత్ వెలుగుల్లో పందిళ్లు
- ఘనంగా చవితి వేడుకలు

పలమనేరు, పుంగనూరు, కుప్పం నియోజకవర్గాల వ్యాప్తంగా శనివారం వినాయక చవితి పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వాడవాడలా, గ్రామాల్లో మండపాలు ఏర్పాటు చేసి, ఆకట్టుకునే వివిధ రూపాల్లో బొజ్జ గణపయ్యల విగ్రహాలను ప్రతిష్టించారు. ఆయా చోట్ల ఉత్సవ కమిటీలు పూజార్చన కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు సందడిగా నిర్వహిస్తున్నాయి.

పలమనేరు: మండల వ్యాప్తంగా చవితి సంబరాలు అంబరాన్నంటాయి. స్థానిక బజారువీధి, మారెమ్మ వీధుల్లోని వినాయకుని విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. నిమజ్జనం చేసే వరకూ వీటిని కొనసాగిస్తారు. కొన్ని చోట్ల అన్నదానం చేశారు. ఇళ్లలో సైతం మట్టి వినాయకుని ప్రతిమలు ఉంచి పూజలు చేశారు. స్థానిక అంకిశెట్టి వీధిలోని 21 అడుగులు, రంగబాబు సర్కిల్ వద్ద 16 అడుగులు, ఎద్దులసంత వీధి, శ్రీనగర్ కాలనీ, ఏఎంసీ మార్కెట్, రాధాబంగ్లా, గొబ్బిళ్లకోటూరు, రాధాబంగ్లా తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఆయా ప్రాంతాల్లోని ప్రజలు అక్కడి బొజ్జగణపయ్యకు పూజలు చేసి ప్రసాదాలను పంపిణీ చేశారు.



వీ.కోట: స్వామి వారిని దర్శించుకుంటున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు



పూజలందుకుంటున్న వినాయకుడు

పెద్దపంజాణిలో..

పెద్దపంజాణి: మండల వ్యాప్తంగా చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలుచోట్ల విభిన్న ఆకారాల్లో ఏకదంతుడు దర్శనమిచ్చాడు. శనివారం ఇంటింటా మామిడాకులు కట్టి, పూల తోరణాలతో నింపి బొజ్జ గణపయ్యకు పూజలు చేశారు. మహిళలు పుట్టలో నాగపడిగలు, పాలు, గుడ్లు వేసి మొక్కులు చెల్లించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

బైరెడ్డిపల్లెలో..

బైరెడ్డిపల్లె: మండలంలోని వివిధ గ్రామాల్లో 5 నుంచి 15 అడుగల వరకు వినాయక విగ్రహాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపాల్లో ప్రతిష్ఠించి పూజలు చేశారు. గృహాల్లో పూజలందుకున్న మట్టి వినాయక ప్రతిమలను యువత కోలాహలం నడుమ నిమజ్జనానికి తరలించారు.

వీ.కోటలో..

వి.కోట: మండల వ్యాప్తంగా వినాయకచవితి పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలుచోట్ల వినాయక ప్రతిమలకు ప్రత్యేక పూజలు చేసి అన్నదానం చేశారు. మండలంలోని కోట నక్కనపల్లెలో నిర్వహించిన వినాయక ఉత్సవాల్లో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు పాల్గొన్నారు. గ్రామస్తులు ఆయనకు తీర్థప్రసాదాలు అందజేశారు.

పుంగనూరు నియోజకవర్గం

పుంగనూరు: వాడవాడలా గణనాథుడికి ఘనంగా పూజలు చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఆలయ ప్రాంగణాలలో ప్రత్యేక పందిళ్లు వేసి, విద్యుత్ దీపాలతో అలంకరించి, వినాయకుని విగ్రహాలను ప్రతి ష్ఠించారు. పట్టణంలోని తేరువీధి, కట్టకిందపాళెం, ఎంబిటిరోడ్డు ప్రాంతాలలో సుమారు 15 అడుగుల ఎత్తు వినాయకుడి విగ్రహాలు ఏర్పాటు చేశారు. అలాగే పట్టణంతోపాటు గ్రామీణ ప్రాంతాలోని 173 ప్రాంతాలలో వినాయక విగ్రహాలు కొలువుదీరాయి. ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అన్నదానం చేశారు. యువత ఉత్సాహంగా కార్యక్రమాలు నిర్వహించింది. అలాగే స్థానిక బెస్త వీధిలో నిర్వహించిన ఉట్లోత్సవంలో యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

చౌడేపల్లెలో..

చౌడేపల్లె: మండల వ్యాప్తంగా గ్రామాల్లో వినాయకుని విగ్రహాలు ఏర్పాటు చేసి పూజలు చేశారు. ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. మహిళలు పుట్ట, రావిచెట్టు , వేపచెట్లకు ప్రత్యేక పూజలు చేసి పాలు పోసి పోగుదారాలు చుట్టారు. బజారువీధి, టీచర్స్ కాలనీ, కేటీ స్ట్రీట్, నేతాజీనగర్, హైస్కూల్ వీధి, గాంధీవీధి, బస్టాండు కూడలి, గోసులకురప్పల్లె, బత్తలాపురం రోడ్డు, పలమనేరు రోడ్డు, నాయుడు కాంప్లెక్స్, భజంత్రి కాలనీ, నాయునివారిపాళ్యం, గంగమ్మ ఆలయం తదితర ప్రాంతాల్లోనూ వేర్వేరు ఆకారాలతో ఉన్న వినాయకుడి విగ్రహాలను నెలకొల్పారు. యువత పాటలు, డ్యాన్స్ హంగామాలు, కేరింతలతో ఆ ప్రాంతం సందడిగా మారింది.

సదుంలో..

సదుం: మండల వ్యాప్తంగా చవితి వేడుకలు భక్తిప్రపత్తులతో జరుపుకున్నారు. ఎర్రాతివారిపల్లె కన్నెమూల గణపతి ఆలయంలో పూజలు చేశారు. మండల కేంద్రంలో మహిళలు నాగరాళ్లకు, పుట్టలకు పూజలు చేశారు. ఇంటిలో మట్టి వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి, నైవేద్యం సమర్పించారు.

కుప్పం నియోజకవర్గం



పూజలు అందుకుంటున్న గణపయ్య



కుప్పం రైల్వేస్టేషన్ వద్ద 25 అడుగుల గణేషుడు

శాంతిపురం: మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన మండపాల్లో గణపయ్య ప్రతిమలను ఏర్పాటు చేసి కోలాహలంగా పూజలు చేశారు. చవితి ప్రత్యేక కార్యక్రమాలతో గ్రామాల్లో సందడి నెలకొంది. ఇళ్లలోనూ గణనాథుడి ప్రతిమలను ఉంచి పూజలు చేశారు. ప్రతిమలను ఏర్పాటు చేసిన మూడవ రోజు నుంచి నిమజ్జనం చేయనున్నారు.

కుప్పంలో..

కుప్పం రూరల్: కుప్పం పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లో శనివారం చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు వినాయక ప్రతిమలను యువకులు ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి గ్రామంలోను వివిధ ఆకృతుల్లో వినాయక ప్రతిమలు ఏర్పాటు చేశారు. ఇక, కుప్పం రైల్వేస్టేషన్, జమిందారు బంగళా, టీటీడీ కళ్యాణ మండపం, జూనియర్ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన 25 అడుగుల ఎత్తు గల వినాయకస్వామి విగ్రహాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కొత్తపేటలోని వినాయకస్వామి ఆలయంలో నిర్వాహకులు స్వామి వారికి ప్రత్యేక అలంకరణతో పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. వినాయక ప్రతిమల వద్ద ఆదివారం రాత్రి యువకులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



పలమనేరులో



పుంగనూరు: తేరువీధిలో..



పెద్దపంజాణి: చిలకపుత్తూరులో



వీ.కోట మండలంలో ..





పలమనేరులో



సదుం: నడిగడ్డలో పూజలు చేస్తున్న గ్రామస్తులు





బైరెడ్డిపల్లె: ఎస్సీ కాలనీలో, చెక్‌పోస్టు కూడలిలో



పుంగనూరు: బస్టాండులో ఉట్టికొడుతున్న యువకులు



పూజలు చేస్తున్న మహిళలు



చౌడేపల్లె: టీచర్స్ కాలనీలో..

యథేచ్ఛగా గ్రానైట్ అక్రమ రవాణా

- పోలీసులు దాడులు చేస్తున్నా డోన్ట్‌కేర్
- అక్రమ రవాణాదారులకు అధికార పార్టీ నేతల అండదండలు

గుడుపల్లె: మండలం మీదుగా నిత్యం గ్రానైట్ దిమ్మెల అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. శాంతిపురం మండలంలోని క్వారీల నుంచి వస్తున్న లారీలు గుడుపల్లె మీదుగా కర్ణాటక, తమిళనాడుకు వెళ్తున్నాయి. రాత్రి పూట పదుల సంఖ్యలో లారీలు యథేచ్ఛగా గ్రానైట్‌ను తరలిస్తున్నాయి. పోలీసులు దాడులు చేస్తున్నా ఏమాత్రం తగ్గడం లేదు. అక్రమార్కులకు అధికార పార్టీ నేతల అండదండలు పుష్కలంగా ఉండడంతో దర్జాగా తరలిస్తున్నారనే విమర్శలొస్తున్నాయి.

నాలుగు లారీలు, ఒక ట్రాక్టర్ సీజ్

గత వారం పోలీసులు దాడులు చేసి నాలుగు లారీలు, ఒక ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. గ్రానైట్ తరలింపులకు సంబంధించి ఎలాంటి రికార్డులు లేకపోవడంతో భూగర్భ గనుల శాఖకు ఆ వాహనాలను అప్పగించారు. అధిక బరువుతో లారీలు వెళ్తుండటాన్ని ఆర్టీఓకు సైతం సమాచారం ఇచ్చారు. ప్రభుత్వానికి ఎలాంటి ఫీజులు, రుసుం కట్టకుండా రాత్రి పూట అధికారుల కళ్లగప్పి తరలిస్తున్నారు. రాత్రి పూట లారీల శబ్దాల మోతకు తాము నిద్రలేని రాత్రులు గడపాల్సి వస్తోందని గ్రామస్తులు వాపోతున్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న లారీ (ఫైల్)



సీజ్ చేసిన ట్రాక్టర్ (ఫైల్)

స్పెషల్ ఫోర్స్ ఏర్పాటేదీ?

గ్రానైట్ అక్రమ రవాణాను కట్టడి చేసేందుకు స్పెషల్ ఫోర్స్ ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో అక్రమ రవాణాను ఉపేక్షించరాదని కోరుతున్నారు.

విజయవాడకు వెళ్లిన పంచాయతీ సిబ్బంది

వి.కోట: విజయవాడలో వరద ప్రభావిత ప్రాంతాల్లో సేవలు అందించేందుకు మండలం నుంచి పంచాయతీ సిబ్బంది ఆదివారం ప్రత్యేక బస్సులో వెళ్లారు. ఉన్నతాధికారుల ఆదేశాలకు మేరకు తాము అక్కడి ప్రజలకు ఇతోధికంగా తమ సేవలందించేందుకు వెళ్తున్నట్టు సిబ్బంది చెప్పారు.



విజయవాడకు వెళ్లిన సిబ్బంది

చిత్తూరు కార్పొరేషన్: విజయవాడలో వరద ప్రభావిత ప్రాంతాల్లో సంరక్షణ పనులు చేసేందుకు పంచాయతీ సిబ్బంది వెళ్లారని డీపీఓ లక్ష్మి తెలిపారు. శనివారం రాత్రి పులిచెర్ల, తవణంపల్లె, వి.కోట, సదుం మండలాల నుంచి మొత్తం 25 మంది వెళ్లారన్నారు. వీరిలో కార్యదర్శులు, స్వీపర్లు, ఎలక్ట్రీషియన్లు ఉన్నారు.

కథాప్రపంచం పుస్తకావిష్కరణ



కథాప్రపంచం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రచయితలు, కవులు

పలమనేరు: అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం పురస్కరించుకుని ఆదివారం స్థానిక శాఖా గ్రంథాలయంలో కథాప్రపంచం పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని పలమనేరు రచయితల సంఘం నిర్వహించింది. పట్టణానికి చెందిన దివంగత రసాయనశాస్త్ర అధ్యాపకులు మలిశెట్టి సీతారాం పేరిట ఎమ్మెస్సార్ ఎడ్యుకేషనల్ సొసైటీ జాతీయ స్థాయిలో నిర్వహించిన తెలుగు కథల పోటీల్లో బహుమతులు పొందిన కథలతో ఈ సంకలనాన్ని ప్రచురించారు. ముఖ్యఅతిథిగా రచయిత జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి, స్థానిక రచయితల సంఘం అధ్యక్షులు ఆర్ మాధవ్ చేతుల మీదుగా దీనిని ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ కొత్త రచయితలను ప్రోత్సహించేందుకు ఎమ్మెస్సార్ నిర్వాహకులు చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. అనంతరం కథాప్రపంచం 2023 సంకలాలను ఏమ్మెస్సార్ ట్రస్ట్ నిర్వాహకులు మలిశెట్టి శ్యామ్‌ప్రసాద్ రచయితలు, పాఠకులకు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక కవులు, రచయితలు కుమారస్వామి రెడ్డి, యుగంధర్, సిద్ధార్థ, సీతారామయ్య, సుదర్శనాచారి, మురళీధర్, కేశవులు తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవకులకు సన్మానం

పలమనేరు: పట్టణానికి చెందిన దివ్యాంశ్ చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు వివిధ రంగాల్లో సేవలందించిన వారిని ఆదివారం స్థానిక సీతారాముల ఆలయం వద్ద సన్మానించారు. కళారంగంలో సేవలందిస్తున్న స్థానికురాలు సుకన్య, సేవారంగానికి సంబంధించి మోహన్‌రావులను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ట్రస్ట్ నిర్వాహకులు మోహన్‌కుమార్, భగీరథి లక్ష్మీపతి పాల్గొన్నారు.